క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే


పాతఎల్లాపూర్‌లో చిన్నారులతో సిబ్బంది

ఖానాపూర్: పట్టణంలోని భర్కత్‌పుర అంగన్‌వాడీ కేంద్రంతోపాటు మండలంలోని పాత ఎల్లాపూర్ పరిధిలోని మూడు కేంద్రాల్లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. పాతఎల్లాపూర్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోకి మూడేళ్లల్లో వచ్చి ఐదేళ్లు నిండిన వారిని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలని తెలిపేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వరలక్ష్మి, సుమలత, మంగ, సత్తెమ్మ, నర్మద తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

సారంగాపూర్: మండలంలోని స్వర్ణ గ్రామంలో హాదీ ఫంక్షన్‌హాల్‌లో గురువారం మధ్యాహ్నం 3:30 గంటలకు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ముఖ్య కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని కోరారు.

అలరించిన వీడ్కోలు వేడుకలు



ప్రదర్శననిస్తున్న విద్యార్థులు

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఐదో తరగతి విద్యార్థులకు నాలుగో తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సమావేశంలో హెచ్‌ఎం ఎల్లన్న, ఉపాధ్యాయులు ఉమారాణి, తన్మయ, అఖిల, ప్రియాంక, పోషకులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులనే విక్రయించాలి


దుకాణం ప్రారంభిస్తున్న రైతులు

కడెం: గ్రోమోర్ ఫర్టిలైజర్ ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలనే విక్రయించాలని ఎంపీపీ అలెగ్జాండర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నూతన భవనంలో ఏర్పాటు చేసిన ఫర్టిలైజర్ దుకాణాన్ని రైతులతో కలిసి ప్రారంభించారు. పదేళ్లుగా ఈ ప్రాంత రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందించడంతోపాటు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు గ్రోమోర్ ఏరియా మేనేజర్ భానుప్రకాశ్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ శ్రీనివాస్, జీవన్‌రెడ్డి, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, సతీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర


వద్యాల్‌లో కేంద్రం ప్రారంభిస్తున్న ఏవో

లక్ష్మణచాంద: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలకేంద్రంతోపాటు వద్యాల్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏఈవో లు ఉమామహేశ్వరి, సంతోష్, పవిత్ర, పీఏసీఎస్ సీఈవో ఉదయ్, సిబ్బంది పాల్గొన్నారు.

సంతాపం


సంతాపం వ్యక్తం చేస్తున్న సభ్యులు

కడెం: కడెం(పాండ్వపూర్) పీఏసీఎస్ వైస్ చైర్మన్ హపావత్ నీల ఇటీవల ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో కార్యవర్గ సభ్యులు నీల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీఏసీఎస్ చైర్మన్ రామడుగు శైలజ, ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ రాజేశ్వర్‌రావు, సీఈవో రాజేందర్, డైరెక్టర్లు, సిబ్బంది రాజేందర్, సాయి, తదితరులు ఉన్నారు.

మట్టి రోడ్లు.. కచ్చా డ్రైయిన్లు..!

- ఆరోవార్డులో కానరాని అభివృద్ధి
- పందుల సంచారం, దోమల బెడదతో తిప్పలు
- ఇబ్బందుల్లో కాలనీవాసులు
- పట్టించుకోని అధికారులు


మట్టిరోడ్డు మధ్యలో పారుతున్న మురుగునీరు


గోపాల్‌నగర్ ప్రధానరోడ్డుపై ఓ ఇంటి ముందు నిలిచిన మురుగునీరు

భైంసాటౌన్: పట్టణంలోని ఆరోవార్డులో ప్రజలు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. కాలనీలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు జరుగక అవస్థలు పడుతున్నారు. ఈ వార్డు పరిధిలో సుభాష్‌నగర్, శాస్త్రినగర్, గోపాల్‌నగర్, శివాజీనగర్ కాలనీలుండగా.. దాదాపు 2వేల వరకు జనాభా ఉంటుంది. సుభాష్‌నగర్, శాస్త్రినగర్, శివాజీనగర్‌లో చాలా వరకు సీసీరోడ్లు, డ్రెయినేజీలు ఉన్నాయి. అయితే గోపాల్‌నగర్‌లో మాత్రం సమస్య తీవ్రంగా ఉంది. ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేకపోవడంతో ఇళ్లలోని మురుగునీరు వెళ్లేదారి లేక ఇళ్ల ముందు, ఖాళీ స్థలాల్లో చేరుతోంది. ఫలితంగా పందుల సంచారం, దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వాన నీటికి తోడు మురికినీరు కలిసి లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి చేరుతోంది. ఫలితంగా కాలనీవాసులు వ్యాధుల బారిన పడుతున్నారు.

గోపాల్‌నగర్‌లో ఎక్కువ మంది పేదలే..

ఆరోవార్డు పరిధిలోని గోపాల్‌నగర్‌లో ఎక్కువగా పేద కుటుంబాలకు చెందినవారే ఉంటున్నారు. ఈ కాలనీలో కొన్నిచోట్ల మాత్రమే సీసీ రోడ్లు, డ్రెయినేజీలు ఉన్నాయి. అవి కూడా సీసీ రోడ్డు ఉన్న చోట డ్రెయిన్లు లేవు. డ్రెయిన్లు ఉన్న చోట రోడ్లు లేవు. చాలా చోట్ల రెండూ లేవు. దీంతో ఇళ్లలో నుంచి వచ్చే మురుగునీరు వెళ్లే దారిలేకపోవడంతో మట్టి రోడ్లపైనే చేరుతోంది. వర్షాకాలంలో మట్టికోతకు గురై వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంటోంది. ద్విచక్రవాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు పారేందుకు సీసీ డ్రెయిన్లు, రాకపోకలకు సీసీ రోడ్లు వేస్తే సమస్య పరిష్కారమవుతుందని కాలనీవాసులు చెబుతున్నారు.

ఆరో వార్డు స్వరూపం..	
కాలనీలు	సుభాష్‌నగర్, శాస్త్రినగర్, గోపాల్‌నగర్, శివాజీనగర్
ఓటర్లు	దాదాపు 1800లకుపైగా
జనాభా	2వేలకుపైగా..
ప్రధాన సమస్యలు	సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు లేవు

మరికొన్ని సమస్యలు..

ఆరోవార్డు పరిధిలోని దాదాపు అన్నికాలనీలకు మిషన్ భగీరథ నీటి సౌకర్యం కల్పించారు. అయితే కొన్నిచోట్ల నల్లా కనెక్షన్లు మురుగు నీటి నుంచే వెళ్తున్నాయి. ఆరోవార్డుతోపాటు నాలుగోవార్డు ప్రజలకు అందుబాటులో గోపాల్‌నగర్‌లో శ్మశానవాటిక ఉంది. ఇక్కడ సౌకర్యాలు లేక అంత్యక్రియలు నిర్వహించేటప్పుడు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శ్మశానవాటికలో స్థలం ఎగుడుదిగుడుగా ఉండడంతో శవయాత్ర సమయంలో ఇబ్బంది తలెత్తుతోంది. ప్రధాన కూడలిలో హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పందులు తిరుగుతున్నయ్..



మా కాలనీలో సీసీ రోడ్లు, డ్రె యినేజీలు లేవు. ఇళ్లలోని మురికినీరు ఇళ్ల ముందే నిలుస్తుండటంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. పందులు తిరుగుతున్నాయి. వర్షాకాలంలో ఎగువ నుంచి వరదతో మురుగునీరు పారుతోంది. రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తే సమస్య తీరుతుంది.

– రత్నమాల, గోపాల్‌నగర్‌వాసి, భైంసా

ఇళ్ల ముందే మురుగు



సీసీ డ్రెయినేజీలు నిర్మించక పోవడంతో తాత్కాలికంగా కచ్చా డ్రెయినేజీలు ఏర్పాటు చేసుకున్నాం. అవి రోడ్డు మధ్యలో ఇళ్ల ముందు ఉండటంతో దుర్వాసన వస్తుంది. మట్టిరోడ్లు సరిగా లేక ఆటోలు కూడా రావడం లేదు. అత్యవసర సమయంలో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం.

– అనసూయబాయి, గోపాల్‌నగర్‌వాసి, భైంసా

ముస్తాబైన హరిహర దేవస్థానం

- పెంబిలో నేటి నుంచి కొనసాగనున్న వార్షికోత్సవం
- మూడు రోజుల పాటు వేడుకలు


ఆలయంలో స్వామివారు


విద్యుత్ కాంతుల నడుమ ఆలయం

పెంబి: మండలకేంద్రంలోని శ్రీ హరిహర దేవస్థానం 16వ వార్షికోత్సవ మహోత్సవాన్ని నేటి నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం వేదపండితులు చక్రపాణి నరసింహమూర్తి, చక్రపాణి వాసుదేవాచార్యులు, నరసింహచార్యుల ఆధ్వర్యంలో అభిషేక ఆరాధనలు, స్వస్తీపుణ్యాహవచనం, రక్షాబంధనం, ఆలయ బలిహరణం నిర్వహించనున్నారు. శుక్రవారం పుణ్యవచనం, స్థాపిత దేవతా ఆరాధనలు, అభిషేకాలు, యజ్ఞాది కార్యక్రమాలు, కుంకుమార్చనలు, ఆలయ బలిహరము, తీర్థప్రసాదం.. శనివారం ఉదయం నిత్యవిధి ఆరాధనలు, మూలమంత్ర హవనం, ఆలయ బలిహరం, గ్రామబలి, శ్రీ హరిహరాదుల కల్యాణ మహోత్సవం అనంతరం అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మహోత్సవానికి భక్తులు తరలిరావాలని కోరారు.


నవంబర్‌లో నిండుకుండలా వాగు


ప్రస్తుతం నీరు లేక బోసిపోయిన వాగు

నాడు కళ కళ.. నేడు వెల వెల

కుంటాల: వర్షాకాలంలో కురిసిన వర్షాలతో మండలంలోని కల్లూర్ వాగు ఫిబ్రవరి వరకు నీటితో కళకళలాడింది. కానీ ప్రస్తుతం ఎండలు పెరిగినందున నీరు అడుగంటి ఎండిపోయింది. రూ.1.15కోట్లతో చెక్ డ్యాం తక్కువ ఎత్తులో నిర్మించడంతో ఫలితం లేకపోయింది. కల్లూర్ వాగు ఎండిపోవడంతో ఓలా, వెంకూర్, అందాకూర్, కల్లూర్ గ్రామాల్లో పశువులు దాహార్తి తీర్చుకునేందుకు అల్లాడుతున్నాయి.

అకాలవర్షం.. అన్నదాతకు నష్టం


దెబ్బతిన్న పంటను చూపిస్తున్న రైతు భోజన్న

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి అకాల వర్షం కురిసింది. ఓలా, కుంటాల, అందాకూర్, లింబా(కె),అంబకంటి గ్రామాల్లో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న పంట కుప్పలు తడిశాయి. ఓలాలో ఒడ్డె భోజన్నకు చెందిన ఎకరం మొక్కజొన్న పంట నేల కొరిగింది. రూ.40 వేలు నష్టం వాటిల్లిందని.. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకున్నాడు.

శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం

కుంటాల: మండలకేంద్రంలోని శ్రీరామకృష్ణ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రతిరోజు ఆలయంలో అర్చన, అభిషేకం, అలంకరణ ఉంటుందని ఆలయ అర్చకులు మోనాజీశాస్త్రీ తెలిపారు. భక్తులు ఉత్సవాలకు తరలివచ్చి జయప్రదం చేయాలని పలువురు నాయకులు కోరారు.

అంబేద్కర్ జయంతి అధికారికంగా నిర్వహించాలి

ఖానాపూర్: ఎన్నికల కోడ్‌తో సంబంధం లేకుండా ఈనెల 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. రాజకీయాలకతీతంగా మహనీయుడి జయంతి జరిపేలా అధికారులు సహకరించాలని కోరారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


పట్టుకున్న ట్రాక్టర్లతో ఎస్సై రాజు

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామ శివారులోని సుద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను బుధవారం సాయంత్రం పట్టుకున్నట్లు లోకేశ్వరం ఎస్సై రాజు తెలిపారు. అనుమతుల్లేకుండా సుద్దవాగు నుంచి లోకేశ్వరం వైపు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు. త్వరలో తహసీల్దార్ కార్యాలయంలో అప్పగిస్తామని.. తహసీల్దార్ మోతీరాం జరిమానా విధిస్తారని పేర్కొన్నారు.

'సాగునీటి రంగంపై తీవ్ర నిర్లక్ష్యం'


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు చిన్నారెడ్డి

భైంసాటౌన్: మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తన పదేళ్ల పదవీకాలంలో సాగునీటి రంగంపై తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారని బీజేపీ నాయకులు విమర్శించారు. బుధవారం పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో తానూర్ మండలాధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ గడ్డెన్నవాగు ప్రాజెక్టు నిర్మించి 20 ఏళ్లు కావస్తున్నా ప్రధాన కాలువ సీసీ లైనింగ్ పనులు పూర్తికాకపోవడం మాజీ ఎమ్మెల్యే నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. నాడు అధికారంలో ఉండి కూడా గుండెగాం సమస్యపై కాలయాపన చేయడంతో నిర్వాసితులు ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. 28ప్యాకేజీ పనులు నేటికీ పూర్తి కాలేదని.. ప్రజాసమస్యలను గాలికొదిలేశారని ఆరోపించారు. అధికారంలో ఉన్న పార్టీలో చేరడం ప్రజాతీర్పును అగౌరవ పరచడమేనని.. ఇకనైనా గొప్పలు చెప్పకుండా వాస్తవాలు గ్రహించాలని సూచించారు. సమావేశంలో ముధోల్ మండలాధ్యక్షుడు పోతన్న, బాలాజీ యాదవ్, శేషరావ్ పటేల్, నర్సారెడ్డి తదితరులు ఉన్నారు.

రంజాన్ ఏర్పాట్లు పరిశీలన


నిర్మల్‌లో పరిశీలిస్తున్న చైర్మన్ ఈశ్వర్


ముధోల్‌లో పరిశీలిస్తున్న ఎస్సై సాయికిరణ్

నిర్మల్‌టౌన్: రంజాన్ పండుగ నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఈద్గా వద్ద ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కమిషనర్ రాజు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఈద్గాం వద్ద ప్రార్థన స్థలంలో మున్సిపల్ సిబ్బంది చేపడుతున్న పనులను వారు పరిశీలించారు. ముస్లింలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యుత్, శానిటేషన్, తాగునీరు, టెంట్లు, టిఫిన్లు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తారకవాణి రఘువీర్, నేరెళ్ల వేణు, అబ్దుల్ మతిన్, అన్వర్ పాషా, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముధోల్‌లో..

ముధోల్: మండల కేంద్రంలోని దర్గాను బుధవారం ఎస్సై సాయికిరణ్ పరిశీలించారు. గురువారం రంజాన్ పండుగ ఉన్నందున ప్రార్థనలు చేసే ముస్లింలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


పోటీలో పాల్గొన్న విద్యార్థులు

సోన్: మండలంలోని న్యూవెల్మల్ బొప్పారం జెడ్పీ ఉన్నత పాఠశాల, శ్రీసాయి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం న్యూవెల్మల్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు మెట్టు సాయికుమార్, బొండ భోజన్న మాట్లాడారు. ఈనెల 14న అంబేద్కర్ జయంతి రోజున విజేతలకు బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాలం విద్యాసాగర్, లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, శైలజ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు పరిశీలన


మాట్లాడుతున్న స్థపతి వల్లినాయగం

సారంగాపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయం పునర్నిర్మాణ పనులను బుధవారం స్థపతి వల్లినాయగం, సబ్ ఇంజినీర్ మల్లికార్జున్‌రెడ్డి, అసిస్టెంట్ స్థపతి గణేషన్, దేవాదాయశాఖ డీఈ ప్రభాకర్, ఏఈ వేణుగోపాల్‌లు పరిశీలించారు. కాంట్రాక్టర్ జగన్‌మోహన్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమ్మవారి నూతన విగ్రహం, పోతరాజు, ద్వారశక్తుల విగ్రహాలతోపాటు దీపస్తంభం తయారీకి దేవాదాయశాఖ కమిషనర్ అనుమతులు తీసుకోవాలని కాంట్రాక్టర్‌కు, స్థానిక అధికారులకు సూచించారు. అనంతరం ప్రతిష్ఠించే స్థలం పరిశీలించి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. ఆలయ ఈఓ రవికిషన్‌గౌడ్, సీనియర్ అసిస్టెంట్ రమణారావు, సిబ్బంది ఉన్నారు.

చర్చితండాకు భగీరథ జలం

సాక్షి స్పందన


లీకేజీలు సరి చేస్తున్న పంచాయతీ సిబ్బంది

సారంగాపూర్: మండలంలోని చర్చితండాలో మిషన్ భగీరథ పైపులైన్ ధ్వంసం కావడంతో తాగునీటి కోసం ప్రజలు చేతిపంపులను ఆశ్రయిస్తూ ఇబ్బంది పడుతున్నారు. అయితే దీనిపై ఈనెల 4న సాక్షిలో 'భగీరథ' నీరందేనా శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాశ్, పంచాయతీ కార్యదర్శి హర్షవర్ధన్ గ్రామంలో భగీరథ పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి బుధవారం మరమ్మతులు చేపట్టారు. ఇంటింటికీ వెళ్లే నల్లా కనెక్షన్లను పరిశీలించి లీకేజీలున్న చోట సరి చేశారు. నల్లాలు బిగించి ఇంటింటికీ తాగు నీరు అందించారు.

అటెన్షన్ ప్లీజ్.. నిరుపయోగంగా దోబీఘాట్



లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాంద గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద రెండేళ్ల కిందట నిర్మించిన దోబీఘాట్ నిరుపయోగంగా మారింది. కొద్దినెలలుగా నీటి కనెక్షన్ లేకపోవడంతో బట్టలు ఉతికేందుకు రజకులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి దోబీఘాట్‌కు నీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899